నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, గురువారం 20 ఫిబ్రవరి 2025 | HANUMAKONDA

## సత్తాచాటుదాం..

భవిష్యత్ బీఆర్‌ఎస్‌దే
కేసీఆర్ దిశానిర్దేశం



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు హాజరయ్యారు. భవిష్యత్ బీఆర్‌ఎస్‌దేనని సత్తాచాటాలని అధినేత శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, గండ్ర వెంకటరమణారెడ్డి, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఒడితల సతీశ్‌కుమార్, మాజీ ఎంపీ మాలోత్ కవిత, జడ్పీ మాజీ అధ్యక్షులు మారెపల్లి సుధీర్‌కుమార్, బడే నాగజ్యోతి, అంగోత్ బిందు, జక్కు శ్రీహర్షిణి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు మెట్టు శ్రీనివాస్, వై సతీశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన భూ వివాదం

- భూపాలపల్లిలో మాజీ కౌన్సిలర్ భర్త దారుణ హత్య
- భూమి పంచాయతీలో జోక్యం చేసుకున్న రాజలింగమూర్తి
- అతడిపై పోలీసులకు ఫిర్యాదు..
- ఆ తర్వాతే హత్య
- మృతుడిపై 12 కేసులు

వివరాలు మెయిన్‌లో



భూపాలపల్లిలో ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు



రాజలింగమూర్తి(ఫైల్)

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ)/భూపాలపల్లి రూరల్ : భూ వివాదం ఒకరి ప్రాణం తీసింది. భూపాలపల్లిలో వివాదాస్పదంగా మారిన ఓ స్థలం విషయంలో మాజీ కౌన్సిలర్ భర్త రాజలింగమూర్తి(48) బుధవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. గతంలో పలువురిని ఏసీబీకి పట్టించిన ఈయనపై పలువురు కక్ష పెంచుకోగా, తాజాగా స్థానిక పోలీస్‌స్టేషన్ ముందున్న భూమి పంచాయితీలో జోక్యం చేసుకోవడం, కొద్దిరోజులుగా గొడవలు జరుగుతుండడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుల దాకా వెళ్లింది. ఈ క్రమంలో రాజలింగమూర్తిపై ఓ వర్గం పోలీసులకు ఫిర్యాదు చేయడం, ఆ తర్వాతే ఈ హత్య జరగడం అనుమానాలకు తావిస్తోంది. కాగా మృతుడిపై ఇప్పటికే భూపాలపల్లిలో 12 కేసులు ఉన్నాయి.

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు.. అధికారుల ప్రణాళికా లోపం వరంగల్ ప్రజలకు శాపంగా మారుతున్నాయి. నగరాభివృద్ధికి అడ్డంకిగా పరిణమిస్తున్నాయి. హడావుడి ప్రకటనలు చేయడం.. అంతే వేగంగా పనులు చేయకపోవడం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. పూడికతీత, సుందరీకరణ పేరిట భద్రకాళీ చెరువును ఖాళీ చేసిన అధికారులు ఇప్పుడు దిక్కులు చూస్తున్నారు. చెరువు మట్టి తవ్వకం ద్వారా కోట్లాది రూపాయలు సమకూర్చుకోవచ్చన్న అంచనా తప్పడంతో అయోమయంలో పడ్డారు. రెండుసార్లు పిలిచిన టెండర్లకు కాంట్రాక్టర్లు ఎవరూ స్పందించకపోవడంతో ఓపెన్ యాక్షన్ వైపు అడుగులు వేశారు. ఇంత చేసినా పూడిక తీసేందుకు ఎవరైనా ముందుకు వస్తారా? వానకాలం లోపు అన్ని పనులు పూర్తవుతాయా? అనే సందిగ్ధత సర్వత్రా నెలకొన్నది.

*- వరంగల్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



నీటిని వదలడంతో ఖాళీగా ఉన్న భద్రకాళీ చెరువు

# నీళ్లు వదిలారు.. దిక్కులు చూస్తున్నారు

**భద్రకాళీ చెరువు సుందరీకరణపై నీలినీడలు**

- అధికారుల ప్రణాళిక లేమి.. అభివృద్ధికి అడ్డంకి
- పూడికతీతకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- రెండుసార్లు టెండర్లు పిలిచినా స్పందన కరువు
- ఓపెన్ యాక్షన్‌కు మొగ్గుచూపిన అధికారులు
- క్యూబిక్ మీటర్ రూ.71.82గా ఖరారు
- జూన్ వరకే పనులకు అనుకూల పరిస్థితులు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక లేకుండా చేపడుతున్న పనులు ప్రతికూలంగా మారుతున్నాయి. హడావుడి ప్రకటనలకు తగినట్లుగా చర్యలు లేకపోవడంతో వరంగల్ నగర అభివృద్ధికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. సుందరీకరణ పేరిట రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు చారిత్రక భద్రకాళీ చెరువును ఖాళీ చేశారు. వానకాలం మొదలయ్యేలోపు పూడిక తీసి, సుందరీకరణ పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు. నీటిని బయటకు వదిలినంత వేగంగా తదుపరి పనులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వ నిర్ణయం, అధికారుల ప్రణాళిక లోపాలతో భద్రకాళీ చెరువు అభివృద్ధి ఇప్పుడు గందరగోళంగా మారింది. చెరువు పూడికతీత పనులను చేపట్టిన సాగునీటి శాఖ.. కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తే భారీగా ఆదాయం వస్తుందని అంచనా వేసింది. 382 ఎకరాల విస్తీర్ణంలోని భద్రకాళీ చెరువులో 5.85 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలకు టెండర్లు పిలిచింది. క్యూబిక్ మీటర్ మట్టిని తవ్వుకునేందుకు రూ.162.56 చొప్పున రూ. 9.50 కోట్ల ఆదాయం సమకూర్చుకునే అంచనాతో ప్రణాళిక రూపొందించింది. అయితే అధికారుల ప్రణాళికకు వాస్తవ పరిస్థితులకు తేడా కొట్టింది. ఈ పనుల కోసం రెండుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. చెరువు సమీపంలో వ్యవసాయ భూములు లేకపోవడంతో పూడిక మట్టిని తీసి ఏం చేయాలనేది అధికారులకు అంతుపట్టడంలేదు. దీంతో రెండు నెలలు ఎదురు చూసిన సాగునీటి శాఖ ఇప్పుడు ఓపెన్ యాక్షన్ వైపు మొగ్గు చూపింది. చెరువులోని క్యూబిక్ మీటర్ మట్టి తవ్వుకునేందుకు రూ.71.82 చెల్లించేలా తాజాగా నిర్ణయించింది. ఇప్పుడు మట్టి తవ్వుకునేందుకు ఎవరైనా ముందుకు వస్తారా అనేది స్పష్టత రావడంలేదు.

### ఆందోళనలో మత్స్యకారులు

భద్రకాళీ చెరువులోని నీరు ఖాళీ చేయడంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు కిందికి పోతున్నాయి. ఈసారి ముందుగానే ఎండలు ఎక్కువయ్యాయి. ఏప్రిల్, మేలో తాగు నీటి సమస్య అధికమయ్యే ప్రమాదం ఉందని పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భద్రకాళీ చెరువు నీటిపై ఆధారపడిన మత్స్యకార కుటుంబాలు గత వానకాలంలో చేపల ఆదాయం కోల్పోయారు. జూన్ నాటికి అనుకున్నట్లుగా చెరువులో నీరు నింపి చేప పిల్లలను వేస్తామని సాగునీటి శాఖ అధికారులు హామీ ఇచ్చారు. ఇంకా పూడిక తీత పనులే మొదలు కాకపోవడంతో మత్స్యకారుల్లో ఆందోళన పెరుగుతున్నది.

### వంద రోజులు

భద్రకాళీ చెరువు సుందరీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు అధికారులు గత ఏడాది నవంబర్ 8న భద్రకాళీ చెరువులోని నీటిని కిందికి వదిలారు. 20 రోజుల్లో 150 క్యూసెక్‌ల జలాలు దిగువన ఉన్న నాగారం చెరువులోకి వెళ్లాయి. వచ్చే మే నెలలోపు ఐదు ఫీట్ల లోతు పూడిక తీసే పనులు పూర్తి చేసి జూన్‌లో కురిసే వానలతో చెరువును నింపాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం వానకాలం మొదలు కాకముందే భద్రకాళీ చెరువు పూడిక తీసి సుందరీకరణ పనులు పూర్తి చేయాలి. ప్రస్తుత పరిస్థితిలో వానకాలం లోపు చెరువు అభివృద్ధి పనుల పూర్తిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నీళ్లు వదిలి వంద రోజులు అవుతున్నదని, మరో వంద రోజుల్లో పనులు పూర్తి కాకుంటే ఇబ్బందులు తప్పవని సాగునీటి శాఖ అధికారులు చెబుతున్నారు.



అంబాల వద్ద నేరెళ్ల వాగును పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

## ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

**వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా.. ఇసుక వాగు, చెక్‌పోస్టుల తనిఖీ**

**నమస్తే ఎఫెక్ట్**

నయీంనగర్, ఫిబ్రవరి 19 : అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. ఇసుక అక్రమ దందాకు అధికారులు అండగా నిలుస్తున్నారంటూ బుధవారం 'ఇసుక దందా.. అధికారుల అండ' శీర్షికతో నమస్తే తెలంగాణ పత్రికలో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన పోలీసు కమిషనర్ స్వయంగా బుధవారం కమలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధి అంబాల నేరెళ్ల వాగును సందర్శించి, ఇసుకను అక్రమంగా తరలించే మార్గాల గురించి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణను అడిగి తెలుసుకున్నారు. అక్రమంగా ఇసుక తరలించే వారి సమాచారాన్ని అందుబాటులో ఉంచుకుని, వారిపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. అలాగే, అంబాల శివారులో ఏర్పాటు చేసిన ఇసుక చెక్ పోస్ట్‌ను సీపీ తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి, నమోదు చేయాలన్నారు. నిరంతరం ఇసుక రవాణా వాహనాలపై నిఘా పెట్టాలని సూచించారు.



ఖానాపురం సొసైటీ ఎరువుల కొనుగోలు కేంద్రంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు



దంతాలపల్లిలో యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

## యూరియా కష్టాలు తప్పవా?

- ఎరువుల కోసం రైతుల బారులు
- అందరికీ దొరకకపోవడంతో తప్పని ఎదురుచూపులు
- కాంగ్రెస్ సర్కారు తీరుపై అన్నదాతల ఆగ్రహావేశాలు
- దంతాలపల్లి, ఖానాపురం, నర్సింహులపేటలో ఇదీ పరిస్థితి..
- తొర్రూరులో పోలీసు పహారాలో పంపిణీ





నర్సింహులపేటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు,(ఇన్‌సెట్‌లో) పీఏసీఎస్ సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న అన్నదాతలు

తొర్రూరు/నర్సింహులపేట/ఖానాపురం/దంతాలపల్లి, ఫిబ్రవరి 19 : యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. సరిపడా దొరకకపోవడంతో పనులు మానుకొని ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతూ గంటలకొద్దీ బారులు తీరారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట, దంతాలపల్లి, వరంగల్ జిల్లా ఖానాపురం మండలకేంద్రాల్లోని అగ్రోస్, పీఏసీఎస్ గోదాముల వద్ద యూరియా బస్తాల కోసం పోటీపడ్డారు. లైన్‌లో ఉన్నవారికి కాకుండా పైరవీకారులకు పెద్ద ఎత్తున యూరియా అమ్ముతున్నారని, ఉదయం వంద బస్తాలు ఉంటే 30మందిమి లైన్లో ఉన్నామని బస్తాలు అయిపోయాయి కానీ తాము మాత్రం ఇక్కడే ఉన్నామంటూ సిబ్బందితో గొడవకు దిగారు. నర్సింహులపేటలో యూరియా కోసం క్యూలైన్లో తోపులాట జరగడంతో గొడవ జరిగింది. గత కొన్ని రోజులుగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో యూరియా సక్రమంగా అందుబాటులో ఉండడం లేదని, నర్సింహులపేట, దంతాలపల్లి మండల కలిపి 220 బస్తాల యూరియా వస్తే పంటలకు యూరియా ఎలా సరిపోతుందని వ్యవసాయ అధికారులను అడిగితే దాటేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. దంతాలపల్లిలో ఒక యూరియా బస్తా కోసం వచ్చిన లారీల నుంచి యూరియా బస్తాలు కిందికి దిగుమతి కాకమందే రైతులు తీసుకొచ్చుకున్న ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలపై బస్తాలను వేసుకునే ప్రయత్నం చేశారు. ఖానాపురం పీఏసీఎస్‌కు బుధవారం ఉదయం లారీ లోడ్ యూరియా రావడంతో రైతులు ఎగబడ్డారు. ఉదయం నుంచి క్యూలో ఉన్నా దొరకక కొందరు రైతులు వెనుదిరిగారు. మధ్యాహ్నం మరో లోడ్ రావడంతో మరి కొంత మంది తీసుకెళ్లారు. సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని పాకాల ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా తొర్రూరులో పోలీసు పహారాల యూరియా పంపిణీ చేయాల్సి వచ్చింది.

వరి నాటు వేసి నెలరోజులైనా ఒక్కసారి కూడా యూరియా వేయలేకపోయామని, వారంలో నాలుగు రోజులు వచ్చినా బస్తా కూడా ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగైతే పంట ఎలా పండిస్తామని సిబ్బందిని నిలదీస్తున్నారు. రెండు వారాలుగా పడరాని పాట్లు పడుతున్న అన్నదాతలు.. మళ్లీ సమైక్యపాలన నాటి రోజులు వచ్చాయని గుర్తుచేసుకుంటున్నారు. యూరియా కొరతను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ వ్యాపారులు అధిక ధరకు అమ్మడంతో పాటు పురుగుమందులను లింక్ పెడుతున్నారని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సంబంధిత వ్యవసాయ శాఖాధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నర్సింహులపేటలో తాత లైన్‌లో ఉండగా గొడవ జరుగడంతో ఏడుస్తున్న మనవడు

### రెండు బస్తాల కోసం నలుగుసార్లు వచ్చిన



యాసంగి రెండు ఎకరాల వరిసాగు చేసిన నాటు వేసి నెల రోజులు గడిచినా ఇప్పటివరకు పొలానికి యూరియా వేయలేదు. రెండు బస్తాల కోసం వారంలో నాలుగు సార్లు వచ్చిన బస్తా కూడా దొరకలేదు. బయట కొందామంటే పైమందు కొంటెనే యూరియా బస్తా ఇస్తామంటున్నరు. ఇప్పటికే పొలానికి పైమందు కొట్టాను. మల్ల పైమందు తీసుకొని ఏం చేసుకోవాలి. ఇప్పటికే నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు యూరియా దొరకక పోతే ఉన్న పంట ఎలా పండుతుందో. – మారపంగు భద్రయ్య, నర్సింహులపేట

## ఆయుష్ సేవలకు మోక్షమెప్పుడు?

- ఇంకా నర్సింగ్ కళాశాల ఆధీనంలోనే భవనం
- ఆయుష్‌కు అప్పగించడంలో నిర్లక్ష్యం
- రూ.10 కోట్లతో బీఆర్‌ఎస్ హయాంలో నిర్మాణం
- డిసెంబర్ 14న ప్రారంభించిన మంత్రి దామోదర
- ఇప్పటికీ మొదలుకాని ఓపీ
- కానరాని ఫర్నిచర్, కరెంట్ సౌకర్యం
- రెండు నెలలుగా నిరుపయోగం





భూపాలపల్లిలో నిర్మించిన ఆయుష్ ఇంటిగ్రేటెడ్ దవాఖాన భవనం,(ఇన్‌సెట్‌లో) దవాఖానకు వేసిన తాళం

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : ఆయుష్ వైద్యం అందని ద్రాక్షలా మారింది. ఉమ్మడి జిల్లాలో కేవలం వరంగల్‌లో మాత్రమే అనంతలక్ష్మి ఆయుర్వేద దవాఖాన 150 పడకలు(వైద్య కళాశాలకు అనుబంధం) అందుబాటులో ఉండగా ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఆయుష్ ఇంటిగ్రేటెడ్ దవాఖానలు లేవు. ఈ క్రమంలో ఆయుష్ వైద్య సేవలను విస్తరించాలనే ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ సర్కారు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్, సిద్దిపేట జిల్లాలకు ఒక్కో భవనానికి రూ.10 కోట్లతో మూడు 50 పడకల ఆయుష్ ఇంటిగ్రేటెడ్ దవాఖాన భవన నిర్మాణ పనులను ప్రారంభించి పనులు పూర్తి చేయించింది. కాగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో డిసెంబర్ 14న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ దవాఖాన భవనాన్ని ప్రారంభించి చేతులు దులుపుకొన్నారు. రెండు నెలలైనా ఫర్నిచర్, ఇతర సౌకర్యాలేవీ కల్పించలేదు. మెడిసిన్ కూడా రాలేదు. ఇదిలా ఉండగా కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రారంభోత్సవానికి ముందు భవనాన్ని తాత్కాలికంగా నర్సింగ్ కళాశాలకు అప్పగించగా కళాశాల యాజమాన్యం ఆ భవనానికి నర్సింగ్ కళాశాల అని బోర్డు పెట్టి ఫర్నిచర్, ఇతర సామగ్రిని ఏర్పాటు చేసుకుని తరగతులు ప్రారంభించేందుకు సిద్ధమైంది. దీనిపై ఆయుష్ డైరెక్టర్ అభ్యంతరం తెలిపారు. దీంతో అందులో నర్సింగ్ కళాశాల తరగతుల నిర్వహణను నిలిపివేసి బోర్డును మార్చేశారు.

### వైద్యసేవల కోసం ఎదురుచూపులు

భూపాలపల్లిలోని ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రిలో వైద్య సేవలు ఎప్పుడు ప్రారంభమవుతాయా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. నర్సింగ్ కళాశాల నుంచి భవనాన్ని ఆయుష్‌కు అప్పగిస్తే సేవలను ప్రారంభించేందుకు ఆయుష్ వైద్యులు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే ఆయుష్ హాస్పిటల్‌కు ఎన్‌ఆర్‌హెచ్‌ఎం నుంచి డిప్యూటేషన్‌పై వైద్యులను అలాట్ చేశారు. ఫర్నిచర్, మెడిసిన్, స్టాఫ్ రావాల్సి ఉంది. ఆయుష్ భవనంలోని మూడు ఫ్లోర్‌లలో నర్సింగ్ కళాశాల ఫర్నిచర్, ఇతర సామగ్రి ఉండడంతో వాటిని షిఫ్ట్ చేస్తే త్వరలో ఓపీ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ విషయమై ఈ నెల 6న జిల్లా కలెక్టర్ సమావేశం ఏర్పాటు చేసి ఆయుష్ హాస్పిటల్‌లో ఓపీ త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఓపీ మొదలైతే ప్రజలకు ఆయుర్వేద, యోగా, నేచురోపతి, యునాని, హోమియోపతి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ సంప్రదాయక వైద్యం కోసం ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్ ఎంతో ఆశగా వేచిచూస్తున్నారు.

### జిల్లాలో 8 డిస్పెన్షరీలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 8 ఆయుష్ డిస్పెన్సరీలు ఉన్నాయి. మూడు ఆయుర్వేదిక్, రెండు హోమియోపతి, మూడు యునాని డిస్పెన్సరీలు ఉన్నాయి. దామెరకుంట, ధర్మారావుపేట, కొడవటంచలో ఆయుర్వేదిక్ డిస్పెన్షరీలు ఉండగా దామెరకుంట, కొడవటంచలో రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్‌లు సేవలు అందిస్తున్నారు. అలాగే ధర్మారావుపేటలో ఎన్‌ఆర్‌హెచ్‌ఎం మెడికల్ ఆఫీసర్ వారానికి మూడు రోజులు(గురు, శుక్ర, శని) వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే చల్లగరిగె, మహాముత్తారంలో హోమియోపతి డిస్పెన్సరీలు ఉండగా చల్లగరిగెలో డాక్టర్ ఉండగా మహాముత్తారంలో లేరు. మహదేవపూర్, వల్లెంకుంట, మొగుళ్లపల్లిలో యునాని డిస్పెన్సరీలు ఉండగా మహదేవపూర్‌లో డిప్యూటేషన్‌పై డాక్టర్ సేవలు అందిస్తున్నారు. వల్లెంకుంటలో బిల్డింగ్ లేదు. మొగుళ్లపల్లిలో డాక్టర్, స్టాఫ్ లేక డిస్పెన్సరీ మూసివేశారు.

### త్వరలో ఓపీ సేవలు ప్రారంభిస్తాం

జయశంకర్ భూపాలపల్లిలో కొత్తగా నిర్మించిన ఆయుష్ హాస్పిటల్‌లో త్వరలోనే ఓపీ సేవలు ప్రారంభిస్తాం. 50 బెడ్లతో కంప్లీట్‌గా ఆయుర్వేదిక్, యోగా, నేచురోపతి, యునాని, హోమియోపతి వైద్యం అందిస్తాం. కానీ భవనం ఇంకా మాకు అప్పగించలేదు. మూడు ఫ్లోర్లలో నర్సింగ్ కళాశాలకు చెందిన ఫర్నిచర్, ఇతర సామగ్రి ఉంది. స్టాఫ్ కావాలని డైరెక్టర్‌ను కోరాం. ఎన్‌ఆర్‌హెచ్‌ఎం నుంచి డిప్యూటేషన్‌పై వైద్యులను కేటాయించారు. మెడిసిన్, స్టాఫ్, ఫర్నిచర్ రావాల్సి ఉంది. నర్సింగ్ కళాశాల కోసం రెండు నెలలు పైఫ్లోర్ కావాలని అడిగారు. కలెక్టర్, మా డైరెక్టర్ నిర్ణయం తీసుకుంటారు. జిల్లాలోని 8 డిస్పెన్సరీల్లో కూడా పూర్తిస్థాయిలో డాక్టర్లను, స్టాఫ్‌ను నియమించి ఉపయోగంలోకి తీసుకొస్తాం.

– డాక్టర్ చంద్ర, ఆయుష్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్